క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హరినామ జపం



జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులకు హారతి ఇస్తున్న అర్చకులు



హరినామ జపం చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో సమస్త ప్రజల సుఖ శాంతిల కోసం హరినామ జప యజ్ఞం నిర్వహించారు. స్థానిక పూరి జగన్నాథ మందిరంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హరే రామ.. హరే కృష్ణ జపాన్ని పఠించారు. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఇస్కాన్ బాధ్యులు రఘునంద సేవక్ ప్రభు సందేశమిచ్చారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కుర్ని సంఘం నాయకులు

కర్నూలు(అర్బన్): కుర్ని సామాజిక వర్గానికి చెందిన వారందరూ తమ పిల్లలను విద్యావంతులను చేస్తే వారికి ఉజ్వల భవిష్యత్తును అందించిన వారమవుతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధా న కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని డాక్టర్ బ్రహ్మారెడ్డి కాన్ఫరెన్స్ హాల్‌లో కుర్ని నేసే సంక్షేమ సంఘం రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ విద్య అత్యంత అవసరమన్నారు. చేనేత, ఇతరత్రా చిన్న చితకా వ్యాపారాలు చేసుకుంటున్న కుర్ని కులస్తులు ఎన్ని కష్టాలు ఉన్నా పిల్లల చదువును అశ్రద్ధ చేయరాదన్నారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కుర్ని ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాదు గుండు కృష్ణయ్య, బందికె వాసుదేవయ్య, జిల్లా అధ్యక్షుడు గడిగె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ పేరుతో రాజకీయాలు తగదు



అంబేడ్కర్ చిత్రపటాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై వైరి పక్షాలు చిత్తశుద్ధి చూపి గౌరవించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళ ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత అన్నారు. బుధవారం 48వ వార్డు రోజావీధిలో అంబేడ్కర్ పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై వాదనలు జరగడం బాధాకరమన్నారు. కేంద్ర హోంమంత్రి చేసిన వ్యాఖ్యలు దారుణమన్నారు. ఈ అవకాశంతో కాంగ్రెస్ పార్టీ ఎంపీలు పార్లమెంట్‌లో చేసిన రభసా అంతా ఇంతా కాదన్నారు. వైరిపక్షాలు అంబేడ్కర్‌ను గౌరవించాల్సింది పోయి ఆయన పేరుతో రాజకీయాలు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నాయకులు జయన్న, పెంచలయ్య, ఆంజనేయులు, రాముడు, సంగాలయ్య, జయంతి బాషా, శాలిమియా పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి వెండి వస్తువుల విరాళం



వెండి వస్తువులను అయ్యప్పస్వామికి బహూకరించేందుకు తీసుకెళ్తున్న భక్తులు

పత్తికొండ(తుగ్గలి): పట్టణంలోని తేరుబజారులో కొలువైన అయ్యప్పస్వామి ఆలయానికి స్థానిక అయ్యప్ప భక్తులు శ్రీనివాసరెడ్డి, శాంతమ్మ దంపతులు వెండి వస్తువులను బహూకరించారు. రూ.1.10లక్షలతో కేజీ వెండితో దీపాలు, నైవేద్యం ప్లేటు తయారుచేయించి బుధవారం ఆలయానికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామానికి వెళ్లేదారిలో బుధవారం సాయంత్రం బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు అయ్యాయి. పట్టణానికి చెందిన కుమార్ అనే వ్యక్తి బైక్‌పై గుడేకల్ గ్రామానికి వెళ్లి తిరిగి పట్టణానికి వస్తుండగా అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు, శరీర భాగాలపై గాయాలు కావటంతో చికిత్స కోసం 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

లోక రక్షకుడు ఏసుప్రభు

- వాడవాడలా క్రిస్మస్ వేడుకలు
- నగరంలోని ప్రధాన కూడళ్లలో క్రిస్మస్ స్టార్లు
- ప్రార్థనా మందిరాల్లో మార్మోగిన జీసస్ కీర్తనలు



హోసన్న మందిరంలో సందేశమిస్తున్న పాస్టర్ ఫ్రెడీ పాల్



క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు కల్చరల్: హ్యాపీ క్రిస్మస్.. మేరీ క్రిస్మస్.. అంటూ క్రైస్తవులు క్రిస్మస్ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. నగరంలోని అన్ని ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. ప్రతి ప్రార్థనా మందిరం క్రైస్తవ భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం అర్ధరాత్రి నుంచే ప్రార్థనా మందిరాల్లో వేడుకలు ప్రారంభమయ్యాయి. క్రైస్తవ కుటుంబ సభ్యులు అందరూ నూతన వస్త్రాలు ధరించి చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విడతల వారీగా చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ప్రత్యేకంగా క్రీస్తు జన్మ వృత్తాంత గీతాలు

అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస ప్రార్థనలు, మిడ్‌నైట్ మాస్ వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు, యువతీ యువకులు వేసిన నాటకాలు, ఆలపించిన గీతాలు అలరించాయి. క్రీస్తు జననం, యేసు చెప్పిన బోధనలు, ఆయన పంచిన ప్రేమ, ఆయన చూపిన శాంతి మార్గం తదితర వాటిని నాటికల రూపంలో ప్రదర్శించారు. నంద్యాల చెక్ పోస్టులోని బిషప్ చర్చిలో బిషప్ గోరంట్ల జాన్వేష్, చిల్డ్రన్స్ పార్క్ సమీపంలోని సీఎస్ఐ చర్చిలో పాస్టర్ రెవ. వరప్రసాద్, కోల్స్ చర్చిలో పాస్టర్ రెవ.అనిల్ కుమార్ సామ్యేల్, హోసన్న మందిరంలో ఫ్రెడీ పాల్, ఎల్‌ఈఫ్ చర్చిలో పాస్టర్ రెవ.దత్తు బాబు, రాక్‌వుడ్ చర్చిలో రెవ.ఆనందరావు, సీక్యాంప్ ప్రార్థనా మందిరంలో రెవ.గంట కరుణా సాగర్ సందేశమిచ్చారు.

లోక శాంతి కోసమే క్రీస్తు జననం

ప్రార్థనా మందిరాల్లో దైవ సందేశకులు క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. లోక శాంతి కోసమే క్రీస్తు జన్మించారన్నారు. ప్రేమ, కరుణ, శాంతి తత్వానికి జీసస్ మార్గదర్శకులన్నారు. క్రీస్తు పశువుల పాక వంటి అతిసాధారణ ప్రదేశంలో జన్మించి సామాన్య జనులకు ఆశాజ్యోతి అయ్యాడన్నారన్నారు. ఆయన జన్మ దినం మానవాళికి శుభోదయమన్నారు. ప్రతి ఒక్కరూ మారు మనసు పొందాలని, నూతన జీవితాన్ని ప్రారంభించాలని ప్రబోధించారు. సమాజంలో తాడిత పీడిత వర్గాలను ఆదరిస్తూ, పెద్దలను గౌరవిస్తూ, పిల్లలను ప్రేమిస్తూ, సమసమాజ స్థాపనలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు.

మానవాళిని సన్మార్గంలో నడిపించడమే ఏసు మార్గం

మానవాళిని సన్మార్గంలో నడిపించడానికి ఏసు క్రీస్తు లోకానికి వచ్చాడని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. నగరంలోని పలు చర్చిల్లో ఆయన సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీసస్ ఆశీస్సులు అందరిపై మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. క్రీస్తు చూపిన శాంతి మార్గంలో నడుచుకోవాలన్నారు. సేవా గుణం అలవర్చుకోవాలన్నారు. ఇతరులపై ప్రేమ, దయ కలిగి ఉండాలని సూచించారు. భారత రాజ్యాంగం సెక్యులర్ దేశంగా భారత దేశాన్ని రూపొందించిందన్నారు. అన్ని మతాలను సమదృష్టితో చూస్తూ సోదర భావాన్ని అలవర్చుకోవాలన్నారు. నగరంలోని అన్ని మతాల పండుగలకు హాజరవుతానని అన్ని మతాలలో తనకు అభిమానులు ఉన్నారని ఇది తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు.





బిషప్ చర్చిలో సందేశమిస్తున్న బిషప్ గోరంట్ల జాన్వేష్, ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

క్రీస్తు జననం మానవళికి పర్వదినం

కర్నూలు(సెంట్రల్): ఏసు క్రీస్తు జననం మానవళికి పర్వదినమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పి.మురళీ కృష్ణ పేర్కొన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలను జిల్లా సాంస్కృతిక విభాగం మాజీ అధ్యక్షుడు కురువ నాగేషు అధ్యక్షతన జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై కేకు కట్ చేసి పార్టీ కార్యకర్తలు, నాయకులకు పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాటి మనిషికి మేలు చేయడమే క్రీస్తు మాట అన్నారు. ప్రతి ఒక్కరిపై శాంతి, కరుణ చూపాలని సూచించారు. నాయకులు సత్యనారాయణగుప్తా, బజారన్న, చంద్రశేఖర్, ప్రమీళ, డీవీ సాంబ శివుడు, షేక్ ఖాజా హుస్సేన్, షేక్ ఖాద్రి పాల్గొన్నారు.



సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ఏసు నామం జపిస్తూ ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



సీక్యాంప్ మందిరంలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



రాక్‌వుడ్ చర్చిలో క్రిస్మస్ గీతాలను ఆలపిస్తున్న మహిళలు



కోల్స్ చర్చిల్లో ప్రార్థన చేస్తున్న పాస్టర్లు





కోల్స్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

డిస్కంల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

కర్నూలు(సెంట్రల్): చండీఘర్ ప్రభుత్వ డిస్కం ప్రైవేటీకరణను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో సుందరయ్య సర్కిల్, పాతబస్టాండ్‌లోని చౌకు బజారులో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక వరుసగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తోందన్నారు. కేంద్ర పాలిత ప్రాంతమైన చండీఘర్ ప్రభుత్వ విద్యుత్ డిస్కంను ప్రైవేట్‌కు అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ సంస్థ ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.250 కోట్ల నుంచి రూ.360 కోట్ల లాభం వస్తోందని, లాభాలు తెచ్చే పెట్టే సంస్థను ప్రైవేటీకరించడం అన్యాయమన్నారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించడం ద్వారా ప్రజలపై భారం పడక తప్పదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్.నరసింహులు, విజయ్ పాల్గొన్నారు.



సుందరయ్య సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ముగిసిన కబడ్డీ పోటీలు

కొలిమిగుండ్ల: క్రిస్మస్ పండుగ సందర్భంగా బెలుం సీఎస్ఐ చర్చి సంఘ పెద్దల ఆధ్వర్యంలో చర్చి ఆవరణలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి 30 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. హోరా హోరీగా పోటీలు సాగాయి. స్థానిక సీఐ రమేష్‌రెడ్డి, బెలుంకు చెందిన వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు రూరల్ సీఐ బాలమద్దిలేటి ఫైనల్ మ్యాచ్ క్రీడాకారులను పరిచయం చేసుకొని మ్యాచ్‌ను ప్రారంభించారు. ఉత్కంఠగా సాగిన పోటీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన శివ టీం మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, తాడిపత్రికి చెందిన టీసీఈ స్పోర్ట్ క్లబ్ టీం రెండో స్థానంలో నిలిచింది. కొలిమిగుండ్ల మహేష్ టీం మూడవ స్థానం, బనగానపల్లెకు చెందిన టార్గెట్ టీం నాల్గవ స్థానంలో నిలిచాయి. విజేత జట్లకు దాతల సహకారంతో సీఐల చేతుల మీదుగా రూ.20,016, రూ.15,016,రూ.10,016, రూ.5016ల నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో బహుమతి దాతలు సర్పంచ్ నీలం మారమ్మ, కొలిమిగుండ్ల ధనరాజు, ఏసేయ్య తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడిపోయిన విద్యార్థిని

- కాపాడిన రైల్వే పోలీసులు

బత్తలపల్లి: తిరుపతి - గుంతకల్లుకు ప్రయాణిస్తున్న రైలు నుంచి ఓ విద్యార్థిని ప్రమాదవశాత్తు కిందకు పడిపోయింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఆమెను కాపాడారు. ఆర్‌పీఎఫ్ సీఐ బోయ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కరివేముల గ్రామానికి చెందిన బోయ నాగరాజు కుమార్తె బోయ హరిత అన్నమయ్య జిల్లా మదనపల్లి వద్ద ఉన్న కలికిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. క్రిస్మస్ సెలవులు రావడంతో బుధవారం తన సోదరుడు గిరి బాబుతో కలసి స్వగ్రామానికి వెళ్లడానికి గుంతకల్లు ప్యాసింజర్ రైలు ఎక్కారు. వీరు ప్రయాణిస్తున్న రైలు ముదిగుబ్బకు చేరగానే హరిత వాష్ రూంకు వెళ్లింది. ఎంతసేపటికీ ఆమె రాకపోవడంతో అనుమానం వచ్చిన సోదరుడు రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. ఆమె వద్దనున్న ఫోన్ సిగ్నల్ ఆధారంగా బత్తలపల్లి మండలం చిన్నే కుంటపల్లి - డి.చెర్లోపల్లి గ్రామాల మధ్య రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే సెక్షన్‌లోని ఆన్ డ్యూటీ కీమెన్ మస్తాన్‌ను అప్రమత్తం చేయడంలో ఆయన అక్కడకు వెళ్లి పరిశీలించారు. సమాచారం అందుకున్న ధర్మవరం రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన హరితను 108 అంబులెన్స్‌లో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదవశాత్తు కింద పడిపోయినట్లు ప్రాథమిక విచారణ తేలింది. ప్రస్తుతం ప్రాణాపాయం నుంచి ఆమె బయటపడినట్లు ఆర్డీటీ వైద్యులు తెలిపారు.



డి.చెర్లోపల్లి-చిన్నేకుంటపల్లి గ్రామాల మధ్య రైలు పట్టాల పక్కన పడిన హరిత

ఐక్యతతోనే సమస్యలకు పరిష్కారం



క్యాలెండర్లను విడుదల చేస్తున్న కురువ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని కురువ కులస్థులు ఐకమత్యంగా ఉంటే ఎలాంటి సమస్యనైనా పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందని కురువ సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి అన్నారు. సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం స్థానిక ఎంపీ కార్యాలయం ఆవరణలో నేతలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కురువ సామాజిక వర్గానికి చెందిన వారికి ఎలాంటి సమస్య వచ్చినా, సంఘం కమిటీ సభ్యులు అందుబాటులో ఉంటారని, ప్రతి ఒక్కరూ సంఘం సేవలను వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా కురువలు తమ చిన్నారుల విద్య పట్ల అశ్రద్ధ చేయకుండా చదివించాలన్నారు. అలాగే విద్య, ఉపాధి, ఉద్యోగ సామాజిక, రాజకీయ రంగాల్లో ఎదిగే కురువలకు సహకారం అందించాలని కోరారు. అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీలీలమ్మ, ప్రధాన కార్యదర్శి అనిత, ఉమ్మడి జిల్లా గొర్రెల సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, డైరెక్టర్ యుగంధర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కోలాటం

కర్నూలు కల్చరల్: ఏపీ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సూర్య కళా కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ఏ క్యాంప్‌లోని హార్ట్ ఫౌండేషన్‌లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జానపద సంగీత నృత్యోత్సవాలు బుధవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమాన్ని ఏపీఎస్‌పీ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ మహబుబ్ బాషా, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షుడు డాక్టర మోక్షేశ్వరుడు, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ ఆర్కే శర్మ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి మాట్లాడారు. యువత తమకిష్టమైన రంగంలో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. జానపద నృత్యాలు, కోలాటాలు గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబిస్తాయన్నారు. అనంతరం విద్యార్థులు, కళాకారులు ప్రదర్శించిన కోలాటాలు అలరించాయి. కార్యక్రమంలో సూర్య కళా కల్చరల్ అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు సోమశంకరయ్య, పద్మావతి, మృదంగం గురువు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



కోలాటం ఆడుతున్న యువతులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

రోడ్లన్నీ గుంతలే !



కొత్తబస్టాండ్ సమీపంలో నడిరోడ్డుపై గుంత

- ఇబ్బందులు పడుతున్న నగరవాసులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- నెలలు గడుస్తున్నా మరమ్మతులు శూన్యం

కర్నూలు న్యూసిటీ: నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే కర్నూలు కొత్తబస్టాండ్ ప్రాంతంలోని ప్రధాన రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలు కూడా పాలకులకు కనిపించడం లేదు. ప్రధాన రోడ్డుపై గుంతలనే పూడ్చలేని ప్రభుత్వం ఇక గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు ఏమాత్రం నిర్మిస్తుందని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగరంలో బళ్లారి చౌరస్తా నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చే ప్రధాన రహదారిని పలు సందర్భాల్లో తాగు నీటి పైప్‌లైన్ మరమ్మతు పనులు చేపట్టేందుకు తవ్వేయడంతో రోడ్డు గుంతలమయంగా మారింది. ఆ మార్గంలో రోజుకు వేల సంఖ్యంలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మున్సిపాలిటీ ఉద్యోగులు తాగునీటి పైపులైన్ మరమ్మతుల కోసం రోడ్డును ఇష్టానుసారంగా తవ్వేసి తమ పనులు పూర్తయ్యాక గుంతలను నిర్లక్ష్యంగా వదిలేశారు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుపై వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనదారులు గుంతలను తప్పించే క్రమంలో అదుపు చేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు. అంతే కాదు కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో ప్రభుత్వ ఆసుపత్రికి ఎదురుగా రోడ్డు మధ్యలో తవ్వన గుంతతో నగరవాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇక్కడే కాదు ఇలాంటి గుంతలు నగరంలోని ప్రధాన రహదారులలో చాలా చోట్ల ఉండడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త బస్టాండ్ నుంచి నగరంలోకి వెళ్లే రోడ్డు ఈద్గా సమీపంలో దాదాపు నెల రోజుల క్రితం వాటర్ పైపులైన్ మరమ్మతులు చేశారు. ఆ ప్రాంతలో నడిరోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. ఇప్పటికీ తారు వేసి గుంతను పూడ్చకపోవడంతో క్రమంగా రోడ్డంతా దెబ్బతింటోంది. అదేవిదంగా నగరంలో ప్రధానమైన ఆర్‌ఎస్ కూడలిలో రోడ్డును తవ్వేసి వదిలేయడంతో అక్కడ కూడా రహదారి గుంతలమయంగా మారి వాహనదారులు అవస్థలు తప్పడం లేదు. అదేవిదంగా కొత్తబస్టాండ్ నుంచి సీతారామ నగర్ మీదుగా వెంకటరమణ కాలనీకి వెళ్లే దారిలో కూడా చాలా చోట్ల గుంతలు దర్శనమిస్తూ వాహన దారులను ఇక్కట్లకు గురిచేస్తున్నాయి.

మరమ్మతులకు నోచుకోని రోడ్లు

మున్సిపల్ సిబ్బంది, ప్రైవేట్ కేబుళ్ల నిర్వాహకులు రోడ్లను తవ్వేసి తమ పనులు పూర్తి చేసుకుని చేతులు దులుపుకుంటున్నారు. ఇలా గుంతలు ఏర్పడి వారాలు నెలలు కావొస్తున్న ఎవరు పట్టించుకోకపోవడంతో ఏమి చేయాలో తెలియక స్థానిక ప్రజలు, వాహనదారులు వాటిని దాటేందుకు ఆపసోపాలు పడుతున్నారు. వాహనదారులు గుంతలను తప్పించే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇదే రహదారులపై నిత్యం రాజకీయ నాయకులు, సంబంధిత శాఖల అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు వాహనాలలో వెళుతుంటారు. వారికి ఈ గుంతలు కనిపించవా? అంటూ నగర ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్‌కు తూట్లు

ఈ నెల 2న జిల్లాకు చెందిన మంత్రి టీజీ భరత్ 'మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్' కార్యక్రమాన్ని నగరంలోని ఆర్‌ఎస్ కూడలిలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని రెండు విడతలుగా చేపట్టారు. జిల్లాలో మొదటి దశలో రూ.11.16 కోట్లతో డిసెంబరు చివరి నాటికి, రెండవ విడత రూ.8.17 కోట్లతో సంక్రాంతి నాటికి రోడ్లన్ని మరమ్మతులు చేసేలా లక్ష్యం నిర్దేశించారు. అయినప్పటికీ నగరంలోని చాలా ప్రాంతాలలోని రోడ్లపై గోతులు అలాగే ఉన్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్లపై ఏర్పడిన గుంతలను ఎప్పటికప్పుడు పూడ్చి వేసి వాహనదారుకు ఇబ్బందులకు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఈద్గా సమీపంలో గుంతలమయంగా రహదారి



ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా నడిరోడ్డుపై గుంత



సీతారామనగర్‌లో రహదారి మధ్యలో గుంత



ఆర్‌ఎస్ కూడలిలో రహదారిపై ఏర్పడిన గుంత

నేడు రైతుబజార్ బంద్

కర్నూలు(అర్బన్): నగరంలోని సీ క్యాంప్ రైతు బజార్‌ను ఈ నెల 26వ తేదీన మూసి వేయనున్నట్లు ఎస్టేట్ ఆఫీసర్ హరీష్‌కుమార్ తెలిపారు. ప్రతి నెలా రైతు బజార్‌ను శుభ్రం చేసే ప్రక్రియలో భాగంగా గురువారం బంద్ నిర్వహిస్తున్నామని, ఈ నేపథ్యంలోనే ఎలాంటి క్రయ విక్రయాలు జరగవని బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మరునటి రోజు శుక్రవారం నుంచి క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని, రైతులు వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు సుదర్శన హోమం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయం వద్ద ఈనెల 26న సుదర్శన హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. ఈ హోమంలో పాల్గొన దలచిన వారు ముందుగానే రూ.1500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీసీ కోరారు. స్వాతి నక్షత్రం సందర్భంగా దేవస్థానంలో ఈ హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హోమంలో పాల్గొనే భక్తులకు దేవస్థానం తరుపున పాల్గొన్న వారికి శేషవస్త్రం, రవిక, స్వామివారి ఫోటో, దేవాస్థానం పేరున్న బ్యాగ్, దేవస్థానం రెండు లడ్డూలున్న బాక్స్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.